
సాక్షి
అనంతపురం
మంగళవారం । 24 । జనవరి । 2023



చీనీ టన్ను రూ.26 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.26 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.22, కనిష్టం రూ.5, సరాసరి రూ.10 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/13.5°
జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

రికార్డు స్థాయిలో ఉపాధి

- వలసలకు చెక్ పెట్టిన జగన్ సర్కారు
- కరోనా విపత్తులోనూ ఆగని పనులు
- సొంతూరిలోనే ఉపాధితో హాయిగా కూలీల జీవనం

ఉపాధి హామీ పథకం ... కూలీల వలసలు నివారించి.. ఉన్న ఊరిలోనే పనులు కల్పించే బృహత్తర పథకం. కరువు జిల్లా అనంతపురంలో కూలీలకు ఈ పథకం ఒక వరం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు వేతనాలను ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తోంది. సొంతూరిలోనే పని దొరుకుతుండటంతో కూలీలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకు పనుల్లో యంత్రాలు వినియోగించారు. ఆనాటి దుర్భర పరిస్థితులకు జగన్ ప్రభుత్వం పూర్తిగా చెక్ పెట్టింది. ఏడాదిలో వంద రోజుల ఉపాధి పనులు తప్పనిసరిగా కల్పించేలా చర్యలు చేపట్టడంతో కూలీల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి.


గుమ్మఘట్ట మండలం గోనబావి వద్ద పశువుల నీటి కుంట తవ్వుతున్న ఉపాధి కూలీలు

రాయదుర్గం: ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రం దూసుకుపోతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ముందు వరుసలో ఉంది. ప్రభుత్వం కూలీలకు చేతినిండా పనులు కల్పించి ఆకలిబాధలు తీర్చింది. 2019-20, 2020-21, 2021-22, 2022-23 వ ఆర్థిక సంవత్సరం ప్రణాళిక బడ్జెట్‌లో కూలీల పనిదినాల లక్ష్యం 8.09 కోట్లు. ఇప్పటి వరకు 8.13 కోట్ల పనిదినాలు కల్పించి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ నాలుగేళ్లలో రూ.1,076 కోట్ల నగదును కూలీల ఖాతాల్లోకి జమ చేశారంటే పథకం పురోగతి ఏ మేరకు ఉందో తెలుస్తుంది.

నాడు దుర్భిక్షం ..
టీడీపీ హయాం(2014- 2019)లో దుర్భిక్ష పరిస్థితులు ప్రజలను వెంటాడాయి. వర్షాభావ పరిస్థితులతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఏర్పడ్డాయి. వందలాది గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించారు. వ్యవసాయం కుదేలవడంతో చేయడానికి పనులు లేక రైతులు, కూలీలు కుటుంబసభ్యులతో సహా వలస వెళ్లడంతో ఊళ్లకు ఊళ్లే నిర్మానుష్యంగా కనిపించాయి.

నేడు సుభిక్షం..
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గత మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. కుంటలు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. భూగర్భజలం అభివృద్ధి చెందింది. ఒట్టిపోయిన బోర్లన్నీ రీచార్జ్ అయ్యాయి. వ్యవసాయం పండుగగా మారింది. ఆయకట్టు భూములు సాగులోకి వచ్చాయి. వ్యవసాయ సీజన్ ముగిసినా కూలీలకు ఉపాధి హామీ పనులు ఆదుకున్నాయి.

అవి వలసలు కాదు..
గుమ్మఘట్ట మండలం గోనబావి, జె.వెంకటాంపల్లి, పూలకుంట, గ్రామాల్లో వడ్డెర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరంతా కేబుల్, ట్రెంచ్ పనులు చేయడంలోనైపుణ్యం కలవారు. కాంట్రాక్ట్‌పై ఇతర రాష్ట్రాల్లో పనులు చేసేందుకు వెళ్తుంటారు. దశాబ్దాల నుంచీ అదే ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. స్వగ్రామాల్లో ఉగాది, మారెమ్మ పండుగలకు వస్తుంటారు. కేబుల్, ట్రెంచ్ పనులకు అలవాటు పడినందున వీరు సొంతూరిలో ఉపాధి పనులపై మొగ్గు చూపడం లేదు. వడ్డెర్లు మినహా మిగిలిన కూలీలు మాత్రం ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. అయినా ఇక్కడ పనులు లేక వలసలు వెళ్తున్నట్లు దుష్ప్రచారం జరుగుతోంది. డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ఇటీవల గోనబావిలో పర్యటించినపుడు కూలీలు 'ఉపాధి' పనులు చేసుకుంటూ కనిపించారు. తగినన్ని పనులు దొరకడం లేదా అని అడిగితే అటువంటి సమస్యేమీ లేదని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పథకం పనుల వివరాలిలా..

సంవత్సరం	పనిదినాలు (కోట్లలో)	పూర్తి చేసినవి (కోట్లలో)	కూలీలకు (రూ.కోట్లలో)	మెటీరియల్‌కు (రూ.కోట్లలో)	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	1.79	1.87	400	403	803
2020-21	2.80	2.80	650	319	969
2021-22	2.56	2.56	572	192	764
2022-23	0.94	90	192	162	354

అడిగిన వారందరికీ ఉపాధి



గ్రామంలో అడిగిన కూలీలందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నారు. వడ్డెర్లు మినహా మిగిలిన వారంతా ఈ పనులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం పశువుల నీటికుంట పనులు జరుగుతున్నాయి.
-కె.రాధమ్మ, ఉపాధి మేట్, గోనబావి

సకాలంలో కూలి డబ్బులు



వారం రోజుల పాటు చేసిన పనులకు శనివారం పేమెంట్ జనరేట్ పూర్తవుతోంది. ఒకటి రెండు రోజులు అటు ఇటు అయినా డబ్బు మాత్రం పక్కాగా జమ అవుతోంది. కూలీలందరూ సంతోషంగా ఉన్నారు.
- చంద్రకళ, ఉపాధి మేట్, గోనబావి

వలస వెళ్లడం మానేశాను



ఆయకట్టుకు బీటీపీ నీరు రావడం, వ్యవసాయ బోర్లన్నీ రీచార్జ్ కావడం, కావాల్సినంతా ఉపాధి స్వగ్రామంలోనే లభిస్తుండడంతో రెండేళ్ల నుంచి వలస వెళ్లడం మానేశాను. గతంలో యంత్రాలతో పనులు చేస్తుండటంతో మాకు పని దొరికేది కాదు. చేసేది లేక పొట్టకూటి కోసం వలస వెళ్లేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు.
- వడ్డే కొల్లమ్మ, ఉపాధి కూలీ, గోనబావి

పండుగలా వ్యవసాయం



వడ్డే కులస్తులు వృత్తి రీత్యా వలసలు వెళ్లడం ఆనవాయితీ. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సాధరణ కూలీలు వలస వెళ్లిన దాఖలాలు లేవు. అడిగిన ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' చూపుతున్నారు. ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో వ్యవసాయం పండుగలా మారింది.
- వడ్డే గోవిందు, ఎంపీటీసీ సభ్యుడు, గోనబావి

ప్రతి ఒక్కరికీ ఉపాధి



ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. ఏడాదికి 100 రోజులు పనులు లభిస్తుండటంతో కూలీల వలసలు ఆగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 90 లక్షలమంది కూలీలకు పనులు కల్పించాం. రూ.195 కోట్లను కూలీల ఖాతాల్లో జమ చేశాం. ఫిబ్రవరి, మార్చిలో మరో రూ.60 కోట్లు కూలీల ఖాతాల్లో జమచేయనున్నాం. ఉపాధి పనులు చెంత ఉండగా కూలీలు ఎవ్వరూ వలస వెళ్లాల్సిన అవసరమే లేదు.
- వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ


ఉపాధి హామీ పనులు ముగించుకుని ఇంటికి వెళుతున్న కూలీలు

బాబు హయాంలోనే కరువు



చంద్రబాబు హయాంలో కరువు కరాళ నృత్యం చేసింది. ఆనాడు ఉమ్మడి జిల్లాలో ప్రజలు పడిన బాధలు, దుర్భర పరిస్థితులు తలచుకుంటే బాధేస్తుంది. ఆదుకోవాల్సిన ఉపాధి హామీ నిధులను 'నీరు -చెట్టు' పనులకు మళ్లించి.. కూలీల నోట్లో మట్టికొట్టారు. ఆనాడు కూలీలు వలస వెళ్లని గ్రామం ఉండేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు మారిపోయాయి. వర్షాలు సమృద్ధిగా కురవడం, భూగర్భజలాలు వృద్ధి చెందడంతో వ్యవసాయం పండుగలా మారింది. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తుండటంతో వలసలు ఆగిపోయాయి. అయితే పచ్చ మీడియా మాత్రం వలసలు కొనసాగుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తోంది.
- కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

న్యూస్‌రీల్

ఉరవకొండ టౌన్‌బ్యాంక్ ఎన్నికలు ఏకగ్రీవం


నామినేషన్లు ఉపసంహరించుకుంటున్న అభ్యర్థులు

ఉరవకొండ: ఉరవకొండ కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 20 మందిలో తొమ్మిది మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన 11 మంది డైరెక్టర్ల స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి బాలగంగాధర్ తెలిపారు. ఏకగ్రీవమైన అభ్యర్థుల్లో ఒకరు తటస్థులు కాగా, మిగతా పది మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. ఎన్నికైన వారిలో సాధు కుళ్లాయిస్వామి, చెంగల మహేష్, ఎస్.వెంకటస్వామి, గిద్దలూరు వెంకటేశులు, గాజుల నాగరాజు, ప్రవీణ్‌కుమార్, కణేకల్లు ఖాజామైనుద్దీన్, ముల్లాషేక్ ఇంతియాజ్, పెద్దకోట్ల రమేష్, మీనుగ ఎర్రిస్వామి, పెద్దకోట్ల శ్రీనివాసులు ఉన్నారు.

జీడీఎస్ ఉద్యోగాల భర్తీకి నేడు నోటిఫికేషన్

అనంతపురం సిటీ: తపాలా శాఖలో ఖాళీగా ఉన్న గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్) పోస్టుల భర్తీకి మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఉద్యోగాలను జీడీఎస్ కింద పరిగణిస్తారు. ఏయే జిల్లాల్లో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఎక్కడెక్కడ ఖాళీలు ఏర్పడ్డాయి, ఎప్పటిలోపు దరఖాస్తు చేసుకోవాలనే సమగ్ర సమాచారంతో నోటిఫికేషన్ విడుదల కానుంది. దరఖాస్తు మొదలు, ఎంపిక విధానం, నియామక ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో ఉంటుంది.

పర్యాటకంగా దేవరకొండ అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న పర్యాటక అధికారి నాగేశ్వరరెడ్డి

బుక్కరాయసముద్రం: స్థానిక సిద్దరాంపురం రోడ్డులో కొండమీదరాయుడు వెలసిన దేవరకొండను పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌తో కలసి సోమవారం ఆయన దేవరకొండను పరిశీలించి, మాట్లాడారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి సూచన మేరకు దేవరకొండను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి దేవరకొండ వరకూ బైక్ ర్యాలీ చేపడతామన్నారు. అనంతరం దేవరకొండ వద్ద సభ ఏర్పాటు చేస్తామన్నారు. సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ హాజరవుతారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చెదళ్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీధరబాబు, దేవదాయ శాఖ ఈఓ బాబు పాల్గొన్నారు.

పట్టు బిగించిన గుజరాత్


తలపడుతున్న ఆంధ్ర, గుజరాత్ జట్లు

అనంతపురం సప్తగిరి సర్కిల్: బీసీసీఐ ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీలో ఆంధ్రపై గుజరాత్ జట్టు పట్టు బిగించింది. రెండో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 361 పరుగులు సాధించింది. వివరాలు.. తొలిరోజు ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 193 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. రెండో రోజు ఒక వికెట్ నష్టానికి 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆట ప్రారంభించిన గుజరాత్ జట్టు 105 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 361 పరుగులు చేసింది. జట్టులో సన్‌ప్రీత్, లోచర్ భాగస్వామ్యం అద్భుతంగా రాణించింది. 271 బంతుల్లో 16 ఫోర్లతో సన్‌ప్రీత్ భగ్గ 125 పరుగులు, 198 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్సర్‌తో లోచర్ 113 పరుగులు సాధించారు.

సాగు సాఫీ..

- ఖరీఫ్‌లో వేరుశనగ, రబీలో పప్పుశనగ పంపిణీ
- కందులు, వరితో పాటు జనుము, జీలుగ విత్తనాలు కూడా..
- విత్తనం వినియోగించుకున్న 1.52 లక్షల మంది రైతులు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్, రబీ ప్రారంభానికి ముందే రైతులకు జగన్ సర్కారు నాణ్యమైన విత్తనం అందుబాటులోకి తెస్తోంది. రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) వేదికగా గ్రామస్థాయిలోనే ఏటా ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ, కందులు, విత్తన వరి, రబీలో పప్పుశనగ, వేరుశనగతో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట (గ్రీన్‌మెన్యూర్) విత్తనాలను పంపిణీ చేస్తోంది. విత్తన పంపిణీకి కొద్ది రోజులు ముందుగానే అంటే మొదటి విడతగా మే ఆఖరులో రూ.7,500 ప్రకారం, రబీకి సంబంధించి అక్టోబర్ మొదటి వారంలో రూ.4 వేల ప్రకారం, చివరగా సంక్రాంతి సమయంలో మిగతా రూ.2వేలు ప్రకారం ఏటా మొత్తంగా రూ.13,500 చొప్పున వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ కింద 2.83 లక్షల మంది రైతు కుటుంబాలకు పెట్టుబడి సాయం అందిస్తోంది. దీంతో సాగుకు ఇబ్బంది లేకుండా రైతులకు సాధ్యమైనంత మేరకు సకాలంలో ప్రయోజనం కల్పిస్తోంది.

రూ.50 కోట్ల విత్తన రాయితీ
గత 2022 ఖరీఫ్, రబీలో విత్తన నాణ్యతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. జిల్లా రైతులకు కొన్నింటిపై 30 శాతం, మరికొన్ని 40 శాతం, ఇంకొన్ని 50 శాతంపై 1.52 లక్షల మంది రైతులకు 1.10 లక్షల క్వింటాళ్లకు పైగా విత్తనానికి రూ.50 కోట్ల వరకు రాయితీ వర్తింపజేసింది. కే-6, కదిరి-లేపాక్షి కే1812 రకం విత్తన వేరుశనగ, ఎల్‌ఆర్‌జీ రకాలు కందులు, రబీలో జేజీ-11 రకం పప్పుశనగ... విత్తన రకాలను బట్టి 30 నుంచి 50 శాతం రాయితీపై పంపిణీ చేసింది. ఖరీఫ్‌కు సంబంధించి 79 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగపై 88,985 మంది రైతులకు రూ.27 కోట్ల రాయితీ ఇచ్చింది. 44,494 మంది రైతులకు రూ.18 కోట్లు రాయితీతోనూ, మినీ కిట్ల రూపంలో ఉచితంగా కందులు పంపిణీ చేశారు. రబీలో 10,507 మంది రైతులకు రూ.2 కోట్ల రాయితీతో 9,200 క్వింటాళ్ల విత్తన పప్పుశనగ, రూ.2.26 కోట్ల రాయితీతో 7,459 మంది రైతులకు విత్తన వేరుశనగ అందించారు. వీటితో పాటు రూ.8 లక్షలు సబ్సిడీతో 16 క్వింటాళ్ల వరకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీలో వేరుశనగ, కంది, మొక్కజొన్న, పచ్చిరొట్ట, పప్పుశనగ తదితర విత్తనాలు 1.30 లక్షల క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనా వేశారు.


విత్తన వేరుశనగ బస్తాలు

ఆర్‌బీకేల్లోనే విత్తనాలు, ఎరువులు
విత్తనాలు ఎరువుల కోసం ఇదివరకటిలా పట్టణాలు, మండలాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆర్‌బీకేల్లోనే అందుబాటులో ఉంచడంతో శ్రమ, సమయం, వ్యయప్రయాసలు తగ్గిపోయాయి. రబీలో రూ.4,635 చెల్లించి మూడు బస్తాలు విత్తన వేరుశనగ తీసుకున్నాను. రైతుల ముంగిటకే ప్రభుత్వ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
- చంద్రన్న, రైతు, నంజాపురం, బ్రహ్మసముద్రం మండలం

ఖరీఫ్ విత్తన ప్రణాళికపై దృష్టి
రానున్న ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు రాయితీతో ఇవ్వడానికి వీలుగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. ఆర్‌బీకే వేదికగా గ్రామస్థాయిలో పంటల ప్రణాళిక, విత్తనాలు, ఎరువుల అవసరాలు, ఇతరత్ర ఇన్‌పుట్స్ అందించడానికి కసరత్తు కొనసాగిస్తున్నాం. ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించడానికి 2023 ఖరీఫ్, రబీ ప్రతిపాదనలు పంపించాం. ఈసారి చిరుధాన్యపు పంటలకు ప్రాధాన్యత ఇవ్వనున్నాం.
- బి.చంద్రానాయక్, డీఏఓ

సంతృప్తికర పరిష్కారం చూపండి


రెవెన్యూ భవన్‌లో అర్జీలు స్వీకరిస్తూ సమస్య వింటున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

- 'స్పందన'లో 418 అర్జీలు

అనంతపురం అర్బన్: అర్జీదారు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. అర్జీలను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలిస్తున్నారని, ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, అనంత సీఈఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 418 అర్జీలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గడువుకు ముందే అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

అర్జీల్లో కొన్ని..
- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, వంట మనుషులు, పారిశుధ్య కార్మికులకు కాంట్రాక్టు ఏజెన్సీ ద్వారా రావాల్సిన నాలుగు నెలలుగా వేతన బకాయిలను ఇప్పించాలని గురుకుల పాఠశాలల కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఓబుళపతి, నాయకుడు ఎల్లన్న, కార్మికులు విన్నవించారు. పీఎఫ్, ఈఎస్ఐ మొత్తం కూడా జమ చేయడం లేదన్నారు.
- మైనారిటీలకు ప్రీ మెట్రిక్యులేషన్ స్కాలర్‌షిప్ పునరుద్ధరించేలా తమ డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి తీసుకెళ్లాలని మైనారిటీ సంఘాల నాయకులు ముష్కిన్, వలి, ఎస్.బాషా, ఇర్ఫాన్, ఇస్మాయిల్ తదితరులు అర్జీ అందజేశారు.
- వైద్యారోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ అకౌంటెంట్ పోస్టు భర్తీలో కోవిడ్-19 వెయిటేజీ మార్కులు కలపని కారణంగా తనకు అన్యాయం జరిగిందని కె.సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. స్కిల్ టెస్ట్‌కు పిలిచినప్పుడు దరఖాస్తు నెంబర్ 7గా ఉందని, ప్రొవిజనల్ జాబితాలో నెంబరు 8గా చూపించారని ఆరోపించాడు. సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరాడు.

ఓపికతో వైద్యం కోసం..


ఓపీ చీటీ కోసం బారులు తీరిన పురుషులు


ఓపీ కౌంటర్ వద్ద క్యూలో ఉన్న మహిళలు

రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. మౌలిక సదుపాయాలు మెరుగుపరచి.. వైద్య ఖాళీలు భర్తీ చేసి.. అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అనంతపురం సర్వజనాస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. నాణ్యమైన వైద్యం ఉచితంగా అందుతుండటంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి రోగులు తరలివస్తున్నారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

అనంతపురం అర్బన్: గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ జిల్లా అధికారులను ఆదేశించారు. వేడుకలపై సోమవారం రెవెన్యూ భవన్‌లో అధికారులతో సమీక్షించారు. శకటాల సిద్ధం, స్టాళ్ల ఏర్పాటు, సాంస్కృతి క కార్యక్రమాల పనులు ఎంత మేరకు వచ్చాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవల అవార్డు గ్రహీతల ఎంపికలో ప్రమాణాలు పాటించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు పరిమిత సంఖ్యలో ఉండేలా చూసుకోవాలని సర్వశిక్ష అభియాన్, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వేడుకలు నిర్వహించే పోలీసు పరేడ్ మైదానంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవి, ఆర్డీఓ మధుసూదన్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య


మృతుడు బాలసుబ్రహ్మణ్యం

గుంతకల్లు: స్థానిక ఆచారమ్మ కొట్టాలకు చెందిన రైల్వే ఉద్యోగి బాలసుబ్రహ్మణ్యం (32) ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం సాయంత్రం హనుమాన్ సర్కిల్ రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను పరిశీలించి బాలసుబ్రహ్మణ్యంగా గుర్తించారు. కాగా, బాలసుబ్రహ్మణ్యం మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్


మహేంద్ర (వృత్తంలో)ను కోర్టులో హాజరు పరిచిన దృశ్యం

ఆత్మకూరు: దాదాపు 12 ఏళ్లుగా కళ్లు గప్పి తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని ఎట్టకేలకు ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. తెలంగాణలోని మంచిర్యాల పట్టణానికి చెందిన మహేంద్రరావు... ఆత్మకూరు మండల సమాఖ్యలో అకౌంటెంట్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో సమాఖ్యకు చెందిన రూ.7,12,784 నగదు డ్రా చేసుకుని తన సొంతానికి వాడుకున్నాడు. విషయాన్ని పసిగట్టిన కావేరి మండల సమాఖ్య అధ్యక్షురాలు సమంత 2009లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మహేంద్రరావును న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం మహేంద్రరావు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కేసు విచారణకు హాజరు కాకపోవడంతో 2011లో మహేంద్రపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను న్యాయస్థానం జారీ చేసింది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న ఈ కేసు పరిష్కారంపై ఎస్పీ ఫక్కీరప్ప దృష్టి సారించడంతో దర్యాప్తులో ఆత్మకూరు పోలీసులు పురోగతి సాధించారు. నిందితుడి ఆచూకీని ఎస్ఐ రంగడు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం సోమవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

భద్రత దిశగా బాలిక

సందర్భం నేడు జాతీయ బాలికల దినోత్సవం

- అన్ని రంగాల్లో దక్కుతున్న ప్రోత్సాహం
- బాలురకు దీటుగా ఎదుగుతున్న బాలికలు

అనంతపురం /అనంతపురం కల్చరల్: బాలికల అక్రమ రవాణాపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని చాటుతూ జిల్లాకు చెందిన భావనసాయి.. చత్తీస్‌ఘడ్‌కు 25 రోజుల సైకిల్ యాత్ర చేసింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ కనపరచిన ఆ అమ్మాయిని ఉన్నత విద్యామండలి కమిషనర్ పోలా భాస్కర్ ప్రత్యేకంగా పిలిపించుకుని సత్కరించారు. ఈ ఘటన నేటి తరం అమ్మాయిల స్వేచ్ఛకు, ఆకాంక్షకు అద్దం పడుతోంది. ఒక్క భావనసాయినే కాదు.. నేటి సమాజంలో ఎందరో బాలికలు... పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో పోటీ పడి ప్రతిభ చాటుతున్నారు. 'అమ్మో కూతురా!' అనే స్థితి నుంచి 'కంటే కూతుర్నే కనాలి' అనే పరిస్థితి వచ్చేలా ప్రజల్లో మార్పు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలో బాలికల ప్రాధాన్యతను తెలిపేలా ఏటా జనవరి 24న 'జాతీయ బాలికాదినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

తొలగిన ఆంక్షలు

లింగ వివక్ష, నిరక్షరాస్యత, ఆర్థిక పరిస్థితులు వెరసి బాలికల అభ్యున్నతిని అడ్డుకుంటూ వచ్చాయి. వారిని వంటింటికే పరిమితం చేసేలా ఆంక్షలు విధించాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. అన్నింటా బాలికలు రాణిస్తుండడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. నిలువెత్తు ఆత్మవిశ్వాసంతో సరికొత్త చరిత్రను బాలికలు సృష్టిస్తున్నారు. ఈ క్రమంలోనే వర్తమాన పరిస్థితులు బాలికలకు పటిష్టమైన భద్రతను కల్పించే దిశగా సాగుతున్నాయి.

భద్రత దిశగా కీలక నిర్ణయాలు

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత బాలికల భద్రతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా దిశ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేశారు. అంతేకాక నగర, పట్టణ ప్రాంతాల్లో గస్తీని పటిష్టం చేస్తూ ప్రత్యేకంగా స్కూటర్లు, స్కార్పియో వాహనాలను సమకూర్చారు. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడ్డ రికార్డు ఉన్న వారిని జియో ట్యాగింగ్ చేసి వారిపై నిఘా పెంచారు. దాడులు, వేధింపులకు అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాల మ్యాపింగ్ చేశారు.

కేంద్ర పథకాల భరోసా

బాలికల సంరక్షణ, వారి చదువులను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం సైతం పలు పథకాలను అమలు చేస్తోంది. బేటీ పడావో–బేటీ బచావో కార్యక్రమంతో భ్రూణహత్యల నివారణతో పాటు బాలికావిద్యాభివృద్ధికి బాటలు వేసింది. బాలికల భవిష్య నిధి కోసం సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినుల మెరుగైన ఆరోగ్యం కోసం పీఎం బాలికా సురక్ష యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. బ్రిడ్జ్ కోర్సులను ఏర్పాటు చేసి వయసుకు తగ్గ తరగతిలో డ్రాపౌట్ బాలికలు చదువుకునేందుకు అవకాశం కల్పించింది. అర్ధంతరంగా చదువు మానేసిన బాలికలకు కస్తూర్బా పాఠశాలలు (కేజీబీవీ) వరంగా మారాయి.


సైకిల్ యాత్ర చేస్తున్న భావన సాయి (ఫైల్)

పెరిగిన ఉత్తీర్ణత శాతం

ఒకప్పటితో పోల్చుకుంటే తల్లిదండ్రుల్లోనూ బాలికల పట్ల స్పష్టమైన మార్పు వచ్చింది. ఆడపిల్లల పట్ల ఎక్కువ అభిమానం చూపించే స్థితికి చేరుకున్నారు. ఆడపిల్లలతో తండ్రికి విడదీయలేని బంధం ఏర్పడుతోంది. చదువు విషయంలో బాలికలు చూపుతున్న శ్రద్ధ, తెలివితేటలేనని ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఒకప్పుడు ఆడపిల్లలకు చదువెందుకంటూ ఇంటికే పరిమితమైన పరిస్థితి నుంచి నేడు సంపూర్ణ ఆధిపత్యం సాధించే దిశగా బాలికలు పట్టు సాధించారు. ఈ క్రమంలో పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో బాలికల జైత యాత్ర కొనసాగుతూ వస్తోంది.

గత మూడేళ్లలో ఇంటర్‌లో బాల, బాలికల ఉత్తీర్ణతా శాతం ఇలా..

విద్యా సంవత్సరం	బాలుర ఉత్తీర్ణత శాతం	బాలికల ఉత్తీర్ణత శాతం
2016-17	65	69.95
2017-18	63	68
2018-19	63	68.15
2019-20	60	70
2020-21	59	67.15

బాలికలకు మరింత భద్రత



గత చట్టాల కన్నా దిశ చట్టం ఎంతో పటిష్టంగా ఉంది. అయితే ఇది చట్టబద్ధత పొందే అంశం పార్లమెంటులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలవుతోంది. దీంతో గతంతో పోలిస్తే బాలికలు, మహిళల పట్ల వేధింపులు తగ్గాయి. ఈ నేపథ్యంలోనే ప్రతి పాఠశాలల, కళాశాలల్లో చదుతున్న బాలికల చేత దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, వినియోగంపై అవగాహన కల్పించాం.
– ఆర్ల శ్రీనివాసులు, దిశ డీఎస్పీ

'పోలీసు స్పందన'కు 118 వినతులు


సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 118 వినతులు అందాయి. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప స్వయంగా వినతులు స్వీకరించి ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమస్యల వలయంలో చిక్కుకుని, ఇబ్బంది పడుతున్న వారికి పోలీసు శాఖ అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఎన్నో సమస్యలను స్పందన కార్యక్రమం ద్వారా పరిష్కరించినట్లు వివరించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, చిన్న చిన్న వివాదాల నేపథ్యంతో కూడిన ఫిర్యాదులే ఎక్కువగా ఉంటున్నాయన్నారు. చట్టపరిధిలోకి రాని సమస్యలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు రండి

- కురుబ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వశికేరి రమేష్

అనంతపురం టవర్‌క్లాక్: మంత్రి ఉషశ్రీ చరణ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని కురుబ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వశికేరి రమేష్ అన్నారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు ఎన్ని ఆక్రమించారో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమన్నారు. ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఆయన కుమారుడు మారుతీచౌదరి చుట్టుపక్కల కొన్ని వందల ఎకరాలు ఆక్రమించడం సత్యం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంగా దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. సృజన కంపెనీకి చెందిన భూమిని మంత్రి దౌర్జన్యంగా రిజిస్టర్ చేయించుకున్నారంటూ పచ్చ పత్రికల్లో అవాస్తవాలు ప్రచురించారంటూ మండిపడ్డారు. సర్వే నంబర్ 225లో 70.40 ఎకరాల భూమి సృజన కంపెనీ పేరు మీదే ఉందన్నారు. బీసీ వర్గానికి చెందిన మహిళ రాజకీయాల్లో రాణిస్తుండడం చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేయడం సబబు కాదని హితవు పలికారు. సమావేశంలో కురుబ యువజన సంఘం నాయకులు ఈశ్వరయ్య, కాటమయ్య, లోకేష్, నవీన్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల పక్షపాతి వైఎస్ జగన్


మాట్లాడుతున్న చామలూరు రాజగోపాల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ నెలలో ముగియనున్న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గడువును మరో పదేళ్ల పాటు పొడిగిస్తూ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా బలహీన వర్గాల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ అన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఆందోళనలు, వినతులు, ప్రజా పోరాటాలు చేస్తే తప్ప ఆర్డినెన్స్ కాని, జీఓ కాని విడుదల కావన్నారు. అలాంటిది ఎలాంటి ప్రజాపోరాటాలు లేకనే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను పదేళ్లపాటు పొడిగిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడమే కాక గవర్నర్‌తోనూ ఆమోద ముద్ర వేయించిన సీఎం వైఎస్ జగన్‌కు బలహీన వర్గాల ప్రజలందరూ కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గానే చూస్తూ వచ్చారన్నారు.

ప్యాకేజీ కోసమే పవన్‌కళ్యాణ్ పాట్లు

తన పార్టీని గెలిపించుకోవాలన్న ఆలోచన జనసేనాని పవన్‌కళ్యాణ్‌కు లేదన్నారు. కేవలం తన ప్యాకేజీ కోసమే ఆయన పరితపిస్తుంటారన్నారు. ఇందుకు 2014, 2019 ఎన్నికలే నిదర్శనమన్నారు. అనంతలో జనసేన బలంగా ఉందని నాగబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరో కూడా కనీసం ఆ పార్టీ నాయకులకే గుర్తు లేదన్నారు. పవన్ కళ్యాణ్ ద్వంద్వ వైఖరి, దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, ఉనికి చాటుకునేందుకు అలజడులు సృష్టించాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

యువతితో అసభ్య ప్రవర్తన

- హోంగార్డుపై కేసు నమోదు


మాట్లాడుతున్న సీఐ తమ్మిశెట్టి

కదిరి టౌన్: యువతితో అసభ్యంగా ప్రవర్తించిన హోంగార్డ్ సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఓ యువతి తన తల్లికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ట్యాబ్లెట్ల కోసం వెళ్తోందన్నారు. అయితే ఆ సమయంలో అర్ధరాత్రి ఏం పని ఉందని బూతులు తిడుతూ స్టేషన్‌కు రావాలని హోంగార్డ్ సుబ్బారెడ్డి బెదిరించాడన్నారు. కానిస్టేబుల్ కాయప్ప, హోంగార్డ్ సుబ్బారెడ్డి ఆ సమయంలో డ్యూటీలో ఉన్నారని అయితే కానిస్టేబుల్‌కు ఈ విషయంలో ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కేవలం హోంగార్డ్ మాత్రమే ఆమెపై దురుసుగా ప్రవర్తించాడని సీఐ పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు. అయితే కేసు లేకుండా రాజీ ప్రయత్నా లు జరుగుతున్నాయని వార్తలొస్తున్నాయని విలేకరులు తెలియజేయగా.. అలాంటిదేమీలేదని, తాము బాధితురాలి వైపే నిలబడతామని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ ఇసాక్ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. వ్యక్తి మృతి

కంబదూరు: భూ తగాదా విషయంగా చోటు చేసుకున్న గొడవలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కంబదూరు మండలం పాళ్లూరు గ్రామానికి చెందిన చిక్కిరప్ప (55), ఈరక్క దంపతులు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా చిక్కిరప్ప, బొమ్మయ్య మధ్య భూ వివాదం నెలకొంది. పలుమార్లు గొడవపడి పోలీస్ స్టేషన్‌కు వరకూ వెళ్లారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ సమయంలో చిక్కిరప్పపై బొమ్మయ్య, అతని భార్య చిత్తక్క దాడి చేయడంతో బలమైన దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

కూడేరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం ఉదిరిపికొండకు చెందిన శ్రీనివాసులు (35) తనకున్న రెండు ఎకరాల భూమితో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. పంటలు సరిగా పండక అప్పులు పెరిగాయి. ఈ క్రమంలో కుటుంబంలో కలహాలు చోటు చేసుకుని కొన్ని నెలల క్రితం భర్తను వదిలి భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో ఒంటరి జీవితంపై విరక్తి పెంచుకున్న శ్రీనివాసులు ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులు తీసి పరిశీలించారు. శ్రీనివాసులు మృతదేహం ఉబ్బిపోయి, కుళ్లిన స్థితిలో కనిపించింది. రెండు రోజుల క్రితం అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అంచనా వేశారు. మృతుడి సోదరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు రవికుమార్, అంజన్న వెల్లడించారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో రాజేష్, తేజశ్విని, అబ్దుల్లా, లావణ్య, జాహ్నవి, లక్ష్మి, పూజిత, హనీఫా ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. అలాగే ఫుట్‌బాల్ బాలికల విభాగంలో లహరి, అరుణాక్షి, వందన, నమ్రత, బాలుర విభాగంలో సంతోష్, రాంచరణ్, యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను అనంతపురంలోని కొత్తూరు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జట్టు మేనేజర్లు దాదాఖలందర్, మారుతి, కో–ఆర్డినేటర్ నాగరాజు, పీడీలు వేణు, ఓబులేసు, రమేష్, శివ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అనంతపురం విజిలెన్స్ – ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెల్లడించారు. రాప్తాడుకు చెందిన రవి తన బొలెరో వాహనంలో అనంతపురంలోని టీవీ టవర్ ప్రాంతానికి చెందిన బియ్యం వ్యాపారి హరితో కలసి 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం మధ్యాహ్నం కర్ణాటకకు తరలిస్తుండగా అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డు కూడలిలో విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై 6(ఏ) కింద కేసు నమోదు చేసి, అనంతపురం నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించారు.

రమేష్.. రెజ్లింగ్‌లో అదుర్స్

అతనో సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడు. మిత్రుడి సలహాలు, స్ఫూర్తి, సహకారంతో రెజ్లింగ్ పోటీల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించాడు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఉన్న మక్కువే అతన్ని ఈ స్థాయికి చేర్చింది. రెజ్లింగ్‌లో ప్రపంచ స్థాయిలో 5వ రేటింగ్ సాధించిన కాకప్పగారి రమేష్ క్రీడాప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో 5వ రేటింగ్ సాధించిన సచివాలయ కార్యదర్శి



రాష్ట్ర మంత్రి రోజాతో రెజ్లర్ రమేష్, శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డితో రమేష్ (ఫైల్)

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన అంజినప్ప, వెంకటలక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.. ఐదుగురు కుమారులు ఉన్నారు. వీరిలో చివరి వాడు రమేష్. 10వ తరగతి వరకూ శ్రీరంగరాజుపల్లిలోని చదువుకున్నాడు. ఆరో తరగతి చదువుతున్నప్పుడు క్రీడలపై ఆసక్తి కలిగింది. అప్పటి పీఈటీ మహేష్‌దీపక్ ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర క్రీడాపోటీల్లో పాల్గొని పలు పతకాలు, ప్రశంసాపత్రాలను కైవశం చేసుకున్నాడు.

క్రీడా కోటాలో బీపీఎడ్..

పరిగి మండలం సేవామందిరంలోని ఏఎం లింగణ్ణ జూనియర్ కళాశాలలో ఇంటర్, హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన రమేష్‌కు పోలీస్ ఉద్యోగం అంటే చాలా ఇష్టం. దీంతో క్రీడలతో పాటు దేహదారుఢ్యంపై దృష్టి సారించి అందుకు తగ్గ వ్యాయామం చేస్తూ ఆహార నియమాలను పాటిస్తూ వచ్చారు. పలుమార్లు పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని రాత పరీక్షల్లో స్వల్ప మార్కుల వ్యత్యాసంతో ఎంపిక కాలేక పోయేవారు. అయినా తన లక్ష్య సాధనలో ఏనాడూ నిరాశ పడలేదు. డిగ్రీ పూర్తి కాగానే స్పోర్ట్స్ కోటాలో తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో బీపీఎడ్ కోర్సులో చేరారు. ఆ సమయంలోనే పలు జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చూపారు.

మిత్రుడి సహకారంతో రెజ్లర్‌గా..

బీపీఎడ్ చేసే సమయంలో కర్నూలుకు చెందిన రమణతో రమేష్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటికే మంచి రెజ్లర్‌గా రాణిస్తున్న రమణ.. ఆ దిశగా రమేష్‌ను ప్రోత్సహించారు. రమణ నేర్పిన మెలకువలతో 2015లో తిరుపతి వేదికగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో రమేష్ పాల్గొని తొలి ప్రయత్నంలోనే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే అప్పటి రెజ్లింగ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ సయ్యద్ రఫీక్, రాఘవేంద్ర వద్ద శిష్యరికం చేస్తూ 2016లో నెల్లూరు జిల్లా నాయుడు పేటలో జరిగిన రాష్ట్ర స్థాయిలో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు.

అనారోగ్యం వెంటాడుతున్నా..

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కర్నూలు వేదికగా 2017లో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం రమేష్‌కు దక్కింది. ఆ సమయంలో తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. అయితే అందివచ్చిన అవకాశాన్ని ఆయన వృథా కానివ్వలేదు. జ్వరంతో బాధపడుతూనే పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించారు. తిరిగి 2018లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ క్రమంలోనే 2019లో ఆగ్రాలో, 2021లో నేషనల్ రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్‌ను సాధించారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక..

రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో దూసుకుపోతున్న రమేష్‌కు 2022లో అదృష్టం వరించింది. ఆ ఏడాది ఢిల్లీ వేదికగా అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగింది. రమేష్‌తో పాటు అనంతపురం జిల్లా గుత్తికి చెందిన అభిరామ్, గుంతకల్లుకు చెందిన అపర్ణ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. అయితే ఇండియా రెజ్లింగ్ టీమ్ కోచ్ రాఘవేంద్రతో పాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులంతా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారే కావడం గమనార్హం.


5వ రేటింగ్‌తో రాణింపు..

రష్యాలోని మాస్కో వేదికగా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ రష్యా ఆధ్వర్యంలో 2022, మే 16 నుంచి 28వ తేదీ వరకూ జరిగిన అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో భారతదేశం తరఫున మొత్తం 18 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఏపీ నుంచి రమేష్, అభిరామ్, అపర్ణ ఉన్నారు. 48 దేశాలకు చెందిన క్రీడాకారులు 8 విభాగాల్లో తలపడగా.. ఇంటర్నేషనల్ రెజ్లింగ్ చాంపియన్‌గా రమేష్ నిలిచారు. ఆ సమయంలో సాధించిన పాయింట్ల ఆధారంగా ప్రపంచ స్థాయిలో 5వ రేటింగ్‌ను రమేష్ వశమైంది.

ప్రస్తుతం సచివాలయ సెక్రెటరీగా..

బీపీఎడ్ పూర్తి చేసిన రమేష్ ప్రస్తుతం హిందూపురం మండలంలోని బాలంపల్లి గ్రామ సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కుటుంబ పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తరుణంలో ఈ ఉద్యోగం వచ్చింది. స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు మరింత సాధన చేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు యువతకు రెజ్లింగ్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నారు.

ఒలింపిక్స్ విజేతనవుతా



వాలీబాల్, క్రికెట్, కబడ్డీ అంటే చాలా ఇష్టం. రెజ్లింగ్ నన్ను ప్రపంచ స్థాయి క్రీడాకారుడిగా నిలబెట్టింది. కోచ్‌లు, క్రీడాశాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, మిత్రులు, కుటుంబసభ్యుల సహకారంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగాను. ఆర్థికంగానూ నన్ను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించాలన్నదే నా జీవిత ఆశయం. తప్పకుండా అందరి సహకారంతో పతకాన్ని సాధించి తీరుతా. – రమేష్, సచివాలయ కార్యదర్శి

క్లుప్తంగా

ఎంపీని కలిసిన మాజీ సైనికోద్యోగులు



ఎంపీ తలారి రంగయ్యను కలిసిన మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: మాజీ సైనికోద్యోగుల సంఘం నాయకులు స్థానిక ఎంపీ తలారి రంగయ్యను ఆయన నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వన్ ర్యాంక్, వన్ పెన్షన్ ద్వారా అధిక సర్వీసు ఉన్నవారికి పెన్షన్ తగ్గుతోందన్నారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పూర్తి వివరాలు ఇవ్వండి.. పార్లమెంట్‌లో సమస్యను లేవనెత్తి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న, కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, నరసింహులు, సచయ్యద్ ఖాజా మొయిద్దీన్, హుస్సేన్, మహమ్మద్ గౌస్, బాలస్వామి, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు మేలు



చిరుధాన్యాల సాగుపై ఎం. చెర్లోపల్లిలో ర్యాలీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది, రైతులు

రాప్తాడు: 2023 సంవత్సరాన్ని ప్రభుత్వం జాతీయ చిరుధాన్యాల సాగు ప్రోత్సాహక సంవత్సరంగా ప్రకటించిందని ఏడీఏ వెంకటరాముడు తెలిపారు. సోమవారం ఎం.చెర్లోపల్లి గ్రామంలో చిరుధాన్యాల సాగుపై వ్యవసాయాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. చిరుధాన్యాల సాగు, ప్రభుత్వ ప్రోత్సాకాలు, పోషక విలువలపై ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ శుభకర్, ఆర్‌బీకే, జెడ్‌పీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తనీయొద్దు



ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

అనంతపురం క్రైం: ఆర్టీసీ సెక్యూరిటీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల ఆదేశించారు. సోమవారం అనంతపురం బస్టాండ్‌ను ఆమె తనిఖీ చేశారు. అవుట్‌పాస్ వద్ద ఆటోల వల్ల ట్రాఫిక్ స్తంభించింది. బస్టాండ్ లోపలి వైపు సెక్యూరిటీ, బస్టాండ్ ఆరు బయట కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. బస్ స్టేషన్‌మేనేజర్ కేఎస్ మూర్తి, సూపరింటెండెంట్ అవధాని శ్రీపాద తదితరులు ఉన్నారు.

సమస్యలపై 'స్పందన'లేదా?



మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆత్మకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండల స్థాయి అధికారుల నిర్వహిస్తున్న స్పందనకు అధికారులు హాజరుకాలేదు. సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలు గంటలతరబడి వేచి చూసి వెనుదిరిగారు. సోమవారం 'స్పందన' రిజిష్టర్‌లో సంతకాలు చేసి అధికారులు వెళ్లిపోయారు. భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఒక్కరు కూడాలేరు. ప్రస్తుతం తహసీల్దార్, డీటీ సెలవులో వెళ్లడంతో రెవెన్యూ కార్యాలయంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి

అనంతపురం అర్బన్: జాతీయ రహదారి నిర్మాణంలో ఇళ్లు, భూములు కోల్పోతున్న బాధితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ అన్నారు. పరిహారం చెల్లింపు అంశంపై రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాంభూపాల్ మాట్లాడుతూ 544డీ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోటరీపురం, శివపురం, బండమీదపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి, ముచ్చుకోట, ఎల్అండ్‌టీ బుగ్గ వరకు 65 ఎకరాల వ్యవసాయభూమి, దాదాపు 400 ఇళ్లు కూల్చాల్సి వస్తోందన్నారు. వీటికి సంబంధించి 2017లో నోటిఫికేషన్ విడుదల చేయగా, 2019లో భూములు, ఇళ్లకు ధర నిర్ణయించారన్నారు. ఇప్పటి ధర ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. అనంతరం ధర్నా వద్దకు ఆర్‌డీఓ మధుసూదన్ వచ్చి బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, రాజరామిరెడ్డి, విరుపాక్ష, భాస్కర్, జగనమోహన్ పాల్గొన్నారు.

నాగబాబు ఫొటోషూట్ ఫెయిల్యూర్

- జనసేన నేత నాగబాబుపై మేయర్ వసీం ఫైర్



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: జనసేన నాయకుడు నాగబాబు ఈ నెల 22న చెరువుకట్టపై చేసిన ఫొటో షూట్ ఫెయిల్యూరైందని మేయర్ వసీం విమర్శించారు. మేయర్ తన చాంబర్‌లో మేయర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నగరంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే జనసేన నాయకుడు నాగబాబు చౌకబారు విమర్శలు చేయడం సరికాదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. వీటితో పాటు రూ.25 కోట్ల స్పెషల్ గ్రాంట్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు జరగనున్నాయన్నారు. నగరంలో ప్రధాన రోడ్లు, సెంట్రల్ లైటింగ్, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వివిధ డివిజన్లలో అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు కుమ్మక్కై దిగుజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వీరెన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, సైఫుల్లాబేగ్, నాయకులు కుళ్లాయస్వామి పాల్గొన్నారు.

జనసేన పార్టీకి అజెండా ఏదీ?



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

అజెండాలేని జనసేన పార్టీ తరఫున నాగబాబుకు నగర అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నెల 22న చెరువుకట్టపై నాగబాబు చేసిన ఓవరాక్షన్‌ను ఆయన తప్పుబట్టారు. నగరం అభివృద్ధి చెందుతోందని, దీన్ని చూసి ఓర్వలేక ఏదో ఒక నెపాన్ని నెట్టి వైఎస్సార్ సీపీని అబాసుపాలు చేయాలని చూశారన్నారు. చివరకు ఏమీ చేయలేక నాగబాబుకే భంగపాటు తప్పలేదన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా స్కూళ్లు, ఆస్పత్రుల రూపురేఖలను ప్రభుత్వం మార్చేసిందన్నారు. రూ.వందల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే..జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ టీడీపీ, బీజేపీలతో కుమ్మక్కై నీచ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. కాపుల అభివృద్ధితో కోసం పోరాటం చేస్తున్న ముద్రగడ పద్మనాభంకు గతంలో అవమానం జరిగితే ఏనాడైనా పవన్‌కళ్యాణ్, నాగబాబు, వారి పార్టీ నాయకులు పరామర్శించారా? అని ప్రశ్నించారు. మంత్రి రోజాకు స్థాయి లేదని నాగబాబు మాట్లాడడం సరికాదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు లాలూ, సుజాత పాల్గొన్నారు.

వేగంగా సమగ్ర రీసర్వే



ఇంటిని సర్వే చేస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: భూ రికార్డులకు శాశ్వత రక్షణ కల్పించే క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన 'జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం' కింద అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలో సమగ్ర సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. తొలివిడతగా మండలంలో గొల్లపల్లిలో సమగ్ర సర్వే పూర్తి చేసి, అందుకు సంబంధించిన పత్రాలను అందజేశారు. రెండోవిడతగా రాచానపల్లి పంచాయతీలో చేస్తున్నారు. ఓవైపు వ్యవసాయ భూములను రెవెన్యూ, సర్వే అధికారులు నాలుగు బృందాలుగా సర్వే చేస్తున్నారు. దాదాపు 50 శాతం పూర్తయ్యాయి. పంచాయతీ మొత్తం 1,702 ఇళ్లు ఉండగా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో ప్రతి ఇల్లూ రీసర్వే చేస్తున్నారు. డాక్యుమెంటు ఆధారంగా ఇంటి కొలతలు, డాక్యుమెంట్ నంబరు, యజమాని పేరు, అసెస్‌మెంట్ నంబరు, ఆధార్ కార్డ్ నంబరు, ఫోన్ నంబరు, ఇంటి నిర్మాణం (తీరు బండా, స్లాబ్, గుడిసె) వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటిదాకా 700కు పైగా ఇళ్లకు సర్వే పూర్తి చేశామని పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

బాల్యవివాహాలు కట్టడి చేయాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి

రాప్తాడు: బాల్య వివాహాల కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి సూచించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పంగల్‌రోడ్డులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాల్యవివాహాల కట్టడికి సమాజ బాధ్యత అనే అంశంపై అవగాహన కల్పించారు. పీడీ బీఎన్ శ్రీదేవి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బాలికను వివాహం చేసుకుంటే పోక్సో సవరణ చట్టం-2019 సెక్షన్ 4(ఐ) ప్రకారం ఇరవైఏళ్లకంటే తక్కువ కాకుండా జైలు, జరిమానా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త నాగేంద్ర, పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ, ఐసీపీస్ అధికారులు చంద్రకళ, నాగలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతాజీ అడుగుజాడల్లో నడవాలి



నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్కేయూ రెక్టార్ మల్లికార్జున రెడ్డి



కేంద్రీయ విద్యాలయంలో ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కరీంఖాన్



మేయర్ చాంబర్‌లో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, తదితరులు

= ఎస్కేయూ రెక్టార్ మల్లికార్జున

అనంతపురం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ అడుగుజాడల్లో నడవాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ మల్లికార్జున రెడ్డి అన్నారు. సోమవారం ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో పరాక్రమ్ దివస్ నిర్వహించారు. కార్యక్రమానికి రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యదర్శి హరికృష్ణ, ఎస్కేయూ పీఆర్వో డాక్టర్ కే రాంగోపాల్, ఏబీవీపీ నాయకులు చెన్నయ్య, యుగంధర్, దివాకర్, కవిత, బాబ్జీ, వికాస్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

అనంతపురం: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తే అభ్యసనం చురుగ్గా సాగుతుందని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కరీంఖాన్ తెలిపారు. సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివస్‌ను నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయంలో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీ పరీక్షలు నిర్వహించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జీవిత విశేషాలతో విద్యార్థుల్లో స్ఫూర్తినింపేలా, దేశభక్తిని నింపేందుకు పరాక్రమ్ దివస్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించడం గర్వకారణమన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 18 పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరయ్యారు.

అనంతపురం క్రైం: సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో ముందుకెళ్దామని నగరపాలక సంస్థ మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, అబూసలేహా, సుజాత, నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

గుర్తుండిపోయేలా ప్రకాష్‌రెడ్డి సేవలు



కంటి పరీక్షలు చేయిస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలు మర్చిపోలేనివని మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బాలపోతన్న, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తోపుదుర్తి ట్రస్ట్ తరఫున బెంగళూర్ శంకర ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 148 మంది చికిత్సలు చేయించుకున్నారు. వారిలో 46 మందిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సోమవారమే శస్త్ర చికిత్సలకు బెంగళూరుకు ప్రత్యేక బస్సులో తీసుకెళ్లారు. శంకర కంటి ఆస్పత్రి సిబ్బంది, ఆత్మకూరు వైద్య సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు నాయక్, బాబయ్య చౌదరి, గుంటూరు రామాంజనేయులు చౌదరి, వేపచెర్ల సచివాలయ కన్వీనర్ బిల్లే లక్ష్మీనారాయణ, గౌరిదిండ్ల రాము, ఓబీ టైలర్ వెంకటేష్ పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

అనంతపురం అర్బన్: రాయదుర్గం మండలం వేపరాళ్లలో పరిశ్రమల కోసం చేపట్టిన బలవంతపు భూసేకరణ ఆపాలని రైతు సంఘం (సీపీఐ) నాయకులు, రైతులు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. సంఘం వర్కింగ్ అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వేపరాళ్ల రెవెన్యూ పొలంలో 126 ఎకరాల భూమిని సేకరించారన్నారు. ఈ భూమి తప్ప 57 మంది ఎస్సీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన రైతులకు ప్రత్యామ్నాయ జీవనాధారం లేదన్నారు. జేసీ కే తన్‌గార్గ్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు.

కన్నవారికి కడుపుకోత మిగల్చొద్దు

– జేఎన్‌టీయూ ఉపకులపతి రంగజనార్ధన



విజయకుమార్‌ను సన్మానిస్తున్న వీసీ రంగజనార్ధన

అనంతపురం సిటీ: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం యువత ప్రాణాలు కోల్పోతుండడంపై అనంతపురం జేఎన్‌యూటీ విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య జి.రంగజనార్ధన ఆందోళన వ్యక్తం చేశారు. యువత కనీస బాధ్యత లేకుండా రోడ్లపై ఇష్టారాజ్యంగా బైకులు నడుపుతూ ప్రమాదాలు కోరి తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జేఎన్‌టీయూలోని ఆడిటోరియంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. అనంతపురం నగరంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే 39 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామని ఉప రవాణా కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. రెక్టార్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, ఆచార్య భానుమూర్తి , ఆర్టీఓ సురేశ్‌నాయుడు,రవాణా శాఖ అధికారులు రమణారెడ్డి, అతిక, వెంకటేశ్ నాయక్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో విద్యాభివృద్ధికి కృషి

ట్రిపుల్ ఐటీ (రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం-ఆర్‌జేయూకేటీ)ల్లో విద్యాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఇన్‌చార్జ్ ఉపకులపతి ఆచార్య ఎం.విజయకుమార్ తెలిపారు. సోమవారం జేఎన్‌టీయూఏలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ సుజాత, డైరెక్టర్లు, రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్, భానుమూర్తి, కేశవరెడ్డి, సుమలత, కిరణ్మయి, సురేశ్ బాబు, అరుణకాంతి, భువన విజయ, పద్మసువర్ణ, పీఆర్ఓ రామశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ నమోదు మరింత సులువు

అనంతపురం క్రైం: ఆధార్ నమోదు సేవలను ప్రభుత్వం సులభతరం చేసింది. గతంలో బ్యాంకులు, పోస్టాఫీసులు, ఆధార్ కేంద్రాల్లో మాత్రమే ఆధార్ సేవలు అందేవి. ప్రస్తుతం సచివాలయాల్లోనూ ఆధార్ సేవలు అందుబాటులోకొచ్చాయి. ఆధార్‌తో తప్పుల సవరణ, కొత్త కార్డుల నమోదు, ఉన్న కార్డుల అప్‌డేట్ కోసం ప్రజలు సులభంగా సేవలు పొందొచ్చు. నగరంలోని 14 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులోకొచ్చాయి. పాతూరు గాంధీబజారులోని 17వ సచివాలయం, సాయినగర్‌మొదటి క్రాస్‌లోని 30వ సచివాలయం, యువజన నగర్ 59వ సచివాయంలో ఆధార్ సేవలు ప్రారంభించారు. మరో పదిరోజుల్లో మిగితా వాటిని ప్రారంభించనున్నారు. వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులకు ఆ ధార్ సేవలపై శిక్షణ ఇచ్చారు.

ఆధార్‌సెంటర్ ప్రారంభం :

నగరంలోని 41వ డివిజన్ 59వ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను సోమవారం అదనపు కమిషనర్ రమణారెడ్డి ప్రారంభించారు. సచివాలయం పని చేసే సమయాల్లో ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. తొలిసారి ఆధార్‌కార్డు నమోదు చేసుకునే పిల్లలకు ఉచితమన్నారు. పూర్తి బయోమెట్రిక్ అప్‌డేట్‌కు రూ.100, సవరణకు రూ.50, ఆధార్‌ప్రింట్‌కు రూ.30వసూలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గోగుల లక్ష్మీదేవి, జీఎస్‌డబ్ల్యూఎస్ టెక్నికల్ టీం సభ్యుడు నారపరెడ్డి పాల్గొన్నారు.

అనంత వాసుల సాహితీ సేవ అభినందనీయం



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: దశాబ్దాలుగా అనంత వాసులు చేస్తున్న సాహితీ కృషి అభినందనీయమని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. సోమవారం భీమవరంలో జరిగిన సాహితీ పురస్కార ప్రదానోత్సవంలో అనంతకు చెందిన కురుబ దివ్య తేజ, కరణం హరి కిశోర్ తరఫున సుంకర రమేష్ రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారు. ఆశుకవి రియాజుద్దీన్ అహ్మద్ రచించిన వ్యాస మంజూష పుస్తకాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. ప్రముఖ చిత్రకారుడు చింత వెంకటేశ్వర్లు గీసిన స్వామీజీ చిత్రపటంతో ఆయన్ను సత్కరించారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

బుక్కరాయసముద్రం: ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో మరో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ సస్పెండ్ అయ్యాడు. వివరాలు.. నెల్లూరు జిల్లాకు చెందిన మల్లికార్జున రెడ్డితో రూ.25 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసిన కేసులో సీఐ రాము, రైటర్ కరీం సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అయితే ఇదే కేసులో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేష్ తమ సీఐ చెప్పాడంటూ రూ.25 వేలు ఇవ్వాలని మల్లికార్జునరెడ్డిని అడిగినట్లు ఏసీబీ విచారణలో తేలింది. ఈమేరకు ఏసీబీ అధికారులు నివేదికను జిల్లా పోలీసు అధికారులకు పంపారు. దీంతో వారు వెంకటేష్‌ను సస్పెండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లోకి చేరిన డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం పోలీసు సబ్ డివిజనల్ అధికారి ప్రసాద్‌రెడ్డి సోమవారం తిరిగి విధుల్లో చేరారు. ఆయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన విషయం విదితమే. ఆయన స్థానంలో నగర ఇన్‌చార్జ్ డీఎస్పీగా కొనసాగిన మహబూబ్‌బాషా సీసీఎస్ డీఎస్పీగా యథాస్థానానికి వెళ్లారు.

ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంతెనపై సోమవారం సాయంత్రం ఆటో, టూవీలర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు.ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. స్థానిక కళాకారుల కాలనీకి చెందిన ఆంజనేయులు, శింగనమల మండలం కల్లుమడికి చెందిన మదన్ రుద్రంపేట రోడ్డువైపు వెళ్తుండగా, నగరంలోకి అతివేగంగా వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలో కమలానగర్, సూర్యనగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకూ విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ కావ్య ఓ ప్రకటనలో తెలిపారు.

కృష్ణా బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: కృష్ణానది బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, కృష్ణ, చంద్రమోహన్‌రెడ్డి, నవీన్, భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట రాజా హోటల్ సమీపంలో సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవు మృతిచెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం వైపు నుంచి అనంతపురం వస్తున్న బస్సు రాజా హోటల్ సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న ఆవును ఢీకొట్టింది. డ్రైవరు బస్సును ఆపకుండా వెళ్లిపోయాడు. రోడ్డుపై ఉన్న ఆవును స్థానికులు పక్కకు తొలగించారు. రూరల్ ఎస్ఐ ప్రవీణ్, బ్లూకోట్స్-5 టీం పోలీసులు గంగాధర్, అలీ అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌కు ఆటంకం లేకుండా చేశారు.

స్తంభాలు ఏర్పాటు చేయండి

అనంతపురం అర్బన్: సోములదొడ్డి పంచాయతీ పరిధిలోని నవయుగ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని జేసీ కేతన్‌గార్గ్‌కు సీపీఐ నగర సహాయ కార్యదర్శి రమణ, కాలనీవాసులు రాజు, జాఫర్, రామాచారి, ముజీర్, తదితరులు విన్నవించారు. జేసీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో వారు కలిసి వినతిపత్రం అందజేశారు.

కబడ్డీ టోర్నీ ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: నేతాజీ సుభాష్‌చంద్రబోష్ జయంతి సందర్భంగా బీజేపీ భారతీయ జనతాపార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను స్థానిక ఇండోర్ స్టేడియంలో సోమవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు సురేంద్రమోహన్, సందిరెడ్డి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బెంగళూరులో ఈనెల 22న అశ్వమేధ ఆలిండియా ఓపెన్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు శ్రీహ ప్రథమ స్థానంలో నిలిచి, సహృద్ ప్రోత్సాహక ట్రోఫీని అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 471 మంది క్రీడాకారులు హాజరుకాగా, 9 రౌండ్లకు గాను 6 పాయింట్లు సాధించి ప్రథమ స్థానాన్ని బీలో-1200 విభాగంలో శ్రీహ కైవసం చేసుకుంది. 9 పాయింట్లకు 5.5 పాయింట్లు సాధించి సహృద్ ప్రోత్సాహక ట్రోఫీని అందుకున్నాడు.

పేకాట స్థావరంపై దాడి

అనంతపురం: పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని సంత్ గురుదాస్ కాలనీలోని కంపచెట్లలో పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 30,200 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వాసవీ హోమాలు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత శ్రీ వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక పాతూరు, కొత్తూరు శ్రీ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయాల్లో వాసవీ హోమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. వేద మంత్రాల నడుమ పండితులు వాసవీ హోమాన్ని జరిపించి, అమ్మవారి విశ్వరూప సందర్శన వృత్తాంతాన్ని వివరించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు, అభిషేక, అలంకార సేవలు జరిగాయి.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీ ఉత్పత్తులు నిషేధం

అనంతపురం క్రైం: ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరపాలక సంస్థలో అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీలను అదనపు కమిషనర్ సమావేశమయ్యారు. నిబంధనలు అతిక్రమించిన వారికి ఒక చదరపు అడుగుకి రూ.100 జరిమానా విధిస్తారన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శంకర్రావు, ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, టీపీఎస్ మహబూబ్‌జాన్‌పాల్గొన్నారు.

స్పందనకు 10 ఫిర్యాదులు

నగరపాలక సంస్థలో సోమవారం జరిగిన స్పందనలో 10 ఫిర్యాదులు అందాయి. కొందరు కార్మికులు తమ సమస్యలు పరిష్కారించాలని డిప్యూటీ కమిషనర్ సావిత్రికి వినతి పత్రం అందించారు. వెంకటరావునగర్‌కు చెందిన కాంతమ్మ, కమలానగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ, రాణినగర్‌కు చెందిన బాషా పలు సమస్యలపై వినతులు అందించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.